# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 16-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ గిరిజనుల ప్రగతితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

❖ వస్త్ర రంగంలో దేశీయ ఎగుమతులు 2030 నాటికి 9 లక్షల కోట్ల రూపాయలకు చేరుకోవాలన్నది లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెల్లడించారు.

❖ భారతదేశానికి ప్రపంచంలోని దక్షిణ ప్రాంత దేశాల పట్ల పూర్తి విశ్వాసం ఉందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు.

❖ ఢిల్లీ రైల్వేస్టేషన్ తొక్కిసలాట దుర్ఘటనపై విచారణకు ద్విసభ్య కమిటీని రైల్వే శాఖ ఏర్పాటు చేసింది.

❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23న ప్రసారం కానుంది.

============================

గిరిజనుల అభివృద్ధితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఢిల్లీలో “ఆది మహోత్సవ్ 2025”ను రాష్ట్రపతి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ... గిరిజనుల సంప్రదాయాలు, జీవన విధానం దేశ సంస్కృతిని సుసంపన్నం చేస్తున్నాయని అన్నారు. ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి 3 రెట్లు కేటాయింపులు అధికం చేశారని ద్రౌపది ముర్ము పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

============================

వస్త్ర రంగంలో భారతదేశ ఎగుమతులు 2030 నాటికి 9 లక్షల కోట్ల రూపాయలకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెల్లడించారు. ఢిల్లీలోని భారత మండపంలో ఈ రోజు జరిగిన భారత్ టెక్స్ 2025 సభలో ఆయన ప్రసంగిస్తూ... వస్త్రాలు, దుస్తులు ఎగుమతి చేసే దేశాలలో భారతదేశం ప్రస్తుతం 6వ స్థానంలో ఉందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వస్త్రాలతో భారత్ టెక్స్ 2025 దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింభిస్తోందని ప్రధానమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 37 సెకన్లు)

కాగా ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి ఎగ్జిబిషన్ ప్రాంతాన్ని సందర్శించి ఎగ్జిబిటర్లతో సంభాషించారు.

==============================

భారతదేశానికి ప్రపంచంలోని దక్షిణ ప్రాంత దేశాల పట్ల పూర్తి విశ్వాసం ఉందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. ఒమన్‌లోని మస్కట్‌లో ఈరోజు జరిగిన 8వ హిందూ మహాసముద్ర సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. ప్రపంచ వ్యవహారాల్లో తీవ్ర గందరగోళం నెలకొన్న తరుణంలో ఈ సమావేశం జరుగుతోందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులు కొత్త ఆలోచనలు అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల మీద ప్రభావం చూపిస్తాయని అన్నారు. దానిని హిందూ మహాసముద్ర ప్రాంతం కూడా మినహాయింపు కాదని పేర్కొన్నారు. కాగా, హిందూ మహా సముద్ర ప్రాంతాల సమావేశం చాలా మంది భాగస్వాములను ఒకచోట ఏ విధంగా చేర్చిందన్నది ముఖ్యమని విదేశాంగ మంత్రి అన్నారు.

==============================

ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో నిన్న తొక్కిసలాట జరిగి 18 మంది ప్రయాణికులు మరణానికి దారితీసిన దుర్ఘటన మీద రైల్వే శాఖ వివరణ ఇచ్చింది. ఏ ఒక్క రైలును రద్దు చేయలేదని  ప్లాట్‌ఫాం మారుస్తున్నట్టు ఎలాంటి ప్రకటన కూడా చేయలేదని నార్తరన్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి హిమాన్షు శేఖర్ ఉపాధ్యాయ్ తెలిపారు. రద్దీకి అనుగుణంగా సాయంత్రం సమయంలో 5 నుంచి 6 ప్రత్యేక రైళ్లు కూడా వేశామని ఉపాధ్యాయ్ వివరించారు. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌కు పెద్దఎత్తున ప్రయాణికులు తరలివస్తుండటంతో ఢిల్లీ నుంచి ప్రయాగరాజ్‌కు 350 నుంచి 400 రైళ్లు నడుపుతున్నామని చెప్పారు. కాగా, మరోవైపు, తొక్కిసలాట ఘటనపై అత్యున్నత స్థాయి దర్యాప్తునకు రైల్వే శాఖ ద్విసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో కమిటీ ప్రతినిధులు  రైల్వే స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌లను, ఇతర డాక్యుమెంట్లను పరిశీలించారు. దీని మీద త్వరలోనే నివేదికను సమర్పించనున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

విరామం

==============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు  ఈనెల 21వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

==============================

ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి వేదికగా రేపటి నుంచి 3 రోజుల పాటు అంతర్జాతీయ దేవాలయాల సదస్సు నిర్వహించనున్నట్లు మహారాష్ట్ర శాసనమండలి సభ్యుడు  ప్రభుత్వ విప్ ప్రసాద్ లాడ్ తెలిపారు. తిరుపతిలో ఈరోజు

ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు ఈ సదస్సుని ప్రారంభిస్తారని చెప్పారు. ఈ సదస్సుకు 58 దేశాలలోని 1,581 ఆలయాలకు సంబంధించిన ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఆలయ నిర్వహణకు సంబంధించిన వినూత్న విధానాలు, ఉత్తమ పద్ధతులను అన్వేషించడం, స్థిరమైన పర్యావరణ వ్యవస్థతో పాటుగా, డిజిటలైజేషన్, ఆధారిత ఆర్థిక వ్యవస్థను పెంపొందించడం వంటి అంశాల మీద ఈ సదస్సులో చర్చించనున్నామని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

==============================

మరో 10 రోజుల్లో మహా కుంభ మేళా 2025 ముగియనుంది. జనవరి 13న మహా కుంభమేళా ప్రారంభమైంది. ఈ నెల 26వ తేదీ వరకూ సాగనుంది. ఈ నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు మహా కుంభ మేళాకు తరలివస్తున్నారు. దాంతో ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్‌రాజ్‌లో ఆధ్యాత్మిక పండగ వాతావరణం నెలకొంది. దేశం నలుమూలల నుంచీ వస్తున్న భక్తులతో ఈ నగరం కొత్త కాంతులు సంతరించుకుంది. కోట్లాది మంది ప్రజానీకం గంగా-యమున-సరస్వతి త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలను ఆచరిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఇప్పటికే పుణ్యస్నానాలను ఆచరించిన వారి సంఖ్య 50 కోట్లకుపై దాటిందని అధికార వర్గాలు తెలిపాయి. కాగా. రష్యా, క్రొయేషియా, బ్రిటన్, ఫ్రాన్స్‌కు చెందిన పలువురు విదేశీ భక్తులు త్రివేణి సంగమంలో స్నానాన్ని ఆచరించి భారతీయ సంస్కృతి సంప్రదాయాల పట్ల తమకు ఉన్న గౌరవాన్ని చాటుకుంటున్నారు. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం మహా కుంభమేళా విజయవంతంగా సాగేందుకు అన్ని రకాలైన ఏర్పాట్లను చేయడమే కాకుండా ఎప్పటికపుడు పర్యవేక్షిస్తోందని అధికార వర్గాలు వెల్లడించాయి.

==============================

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL 2025) 18వ ఎడిషన్ మార్చి 22 నుంచి మే 25వ తేదీ వరకు జరగనుంది. మొత్తం 74 మ్యాచులు 65 రోజుల పాటు జరుగనుండగా, తొలి మ్యాచ్ మార్చి 22న కోల్‌కతా నైట్‌రైడర్స్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఈడెన్ గార్డెన్స్ వేదికగా ప్రారంభం కానుంది. మార్చి 23న ఉప్పల్ వేదికగా హైదరాబాద్ - రాజస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. అలాగే విశాఖలోని అంతర్జాతీయ క్రికెట్ మైదానానికి రెండు మ్యాచ్‌లను కేటాయిస్తూ... ఐపీఎల్ కమిటీ నిర్ణయం తీసుకుంది. మార్చి 24న దిల్లీ - లఖ్‌నవూ, 30న దిల్లీ - హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

==============================

భిన్నత్వంలో ఏకత్వం అన్న సత్యాన్ని హిందూ సమాజం విశ్వసిస్తుందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (RSS) అధిపతి మోహన్ భగవత్ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ... దేశంలో హిందూ సమాజం బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తోందని చెప్పారు. అందరినీ కలుపుకునే సహజ స్వభావం భారతదేశానికి ఉందని అన్నారు. ప్రపంచంలోని భిన్నత్వాన్ని ఆమోదిస్తూ.. హిందువులు జీవనం సాగిస్తుంటారని గుర్తు చేశారు. భిన్నత్వమే ఐక్యతగా హిందువులు గ్రహించారని మోహన్ భగవత్ గుర్తు చేశారు.

==============================

శబరిమల ఆలయ అభివృద్ధిలో భాగంగా అధికారులు నూతన విధానాలను రూపొందించారు. ఇందులో భాగంగా సన్నిధానం చుట్టూ ఉన్న ఫ్లైఓవర్‌ను తొలగించనున్నారు. దీంతో ఇకపై ఇరుముడితో వెళ్లే భక్తులు పవిత్రమైన 18 మెట్లు ఎక్కగానే స్వామి సన్నిధిలోకి అనుమతిస్తారు. మార్చి 14న మీనమాస పూజల కోసం అయ్యప్ప ఆలయాన్ని తెరవనున్నారు. ఆ రోజు నుంచి నేరుగా బలికల్‌పుర మీదుగా ఎదురుగా ఉండే అయ్యప్ప సన్నిధికి చేరుకోవచ్చునని ఆలయ వర్గాలు తెలిపాయి.

=============================

=============================